క్లుప్తంగా

ఆలయాల్లో శ్రావణ పూజలు



కందనూలు: జిల్లా కేంద్రంలో శ్రావణ శుక్రవారం మొదటి రోజు సందర్భంగా రామాలయం, సుబ్రమణ్యస్వామి ఆలయం, హౌజింగ్‌బోర్డుకాలనీలోని వేంకటేశ్వర దేవాలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో భక్తుల సందడి కన్పించింది. శ్రావణ శోభ సంతరించుకుంది.

రేపటి నుంచి యోగా శిక్షణ తరగతులు

కందనూలు: జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో నాల్గో విడత శిక్షణ తరగతులు ఈ నెల 27 నుంచి యోగా శిక్షకులు శివానందస్వామి ఆధ్వర్యంలో ప్రారంభిస్తున్నట్లు మాజీ కౌన్సిలర్ బాదం సునీత నరేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణా తరగతులు ఉదయం 5 గంటల నుంచి 7గంటల వరకు, సాయంత్రం 6 గంటల నుంచి 7-30 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

29 నుంచి జీవాలకు టీకాలు

బల్మూర్: ఈ నెల 29వ తేదీ నుంచి మండలంలో జీవాలకు నీలి నాలుక(మూతి వాపు) రోగాల నివారణ టీకాల పంపిణీ నిర్వహిస్తునట్లు పశువైద్యాధికారి డా.అనిల్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వేలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత వర్షకాల సీజన్‌లో అత్యధికంగా జీవాలకు వివిధ రకాల వ్యాధులు సోకే అవకాశం ఉన్నందున జీవాల రైతులు తప్పనిసరి టీకాలు వేయించాలన్నారు. ఆగస్టు 8వ తేదీ వరకు టీకాలు వేస్తునట్లు వివరించారు. అదేవిధంగా మండల కేంద్రంలోని పశువైద్యశాలకు 75 శాతం సబ్సిడీతో కూడిన గడ్డి విత్తనాలు సరఫరా అయ్యాయని కావాల్సిన రైతులు తీసుకెళ్లాలని కోరారు. మొక్కజొన్న అమోరికన్‌టాగ్ రకం ఐదు కిలోలకు రూ.110, సీఎస్‌హెచ్ 24 ఎంఎఫ్ రకం రూ.130 చొప్పన చెల్లించి తీసుకెళ్లాలని కోరారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

తెలకపల్లి: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏపీఓ మల్లేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని రాకొండ, బండపల్లి తదితర గ్రామాలతో మొక్కలు నాటారు. గౌరారంలో ఇంటింటికి మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తాం

మన్ననూర్: చెంచులకు సంబంధించిన వ్యవసాయ భూముల సమస్య పరిష్కరించకపోతే పార్టీలకు అతీతంగా స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తామని చెంచు సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి నాగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. అమ్రాబాద్ మండలంలోని కండ్లకుంటలోని భూములను పేదలు ఆదివాసి చెంచులు దశాబ్దాల కాలంగా సాగు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం సాగులో ఉన్నవారందరికీ పట్టాలు ఇవ్వాలని కోరారు.

జాతీయ స్థాయి శిక్షణకు ఉపాధ్యాయుడి ఎంపిక



కల్వకుర్తి రూరల్: నూతన జాతీయ విద్యా విధానం 20-20 లో భాగంగా రాజస్థాన్ రాష్ట్రం ఉదయపూర్‌లో ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 10వ తేదీ వరకు జరిగే శిక్షణకు కల్వకుర్తి మండలం జీడిపల్లి తండా ఉపాధ్యాయుడు రఘురాం ఎంపికయ్యారు. గత నెల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి శిక్షణలో వినూత్న బోధన పద్ధతులు, పాఠశాల అభివృద్ధి తదితర అంశాలపై ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి జాతీయ స్థాయి శిక్షణకు రఘురాంతో పాటు ఉప్పునుంతల బాలుర ప్రాథమిక పాఠశాల చెందిన గాజుల వెంకటేష్ ఎంపికయ్యారు. వీరిని సహ ఉపాధ్యాయులు అభినందించారు.

పథకాలపై అవగాహన కల్పించాలి

తాడూరు: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలని యూత్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి వినోద్‌కుమార్ అన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడంతో పాటు పేద ప్రజల సంక్షేమ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలయ్యే తీరును వివరించాలని కోరారు. వెంకట్‌రెడ్డి, కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



అడవిబిడ్డలకు ఆసరా ఏది?

- ఫలసాయం మొక్కల కోసం ఎదురుచూపులు
- ఆదివాసీ చెంచుల జీవితాలు దుర్భరం



అడవి నుంచి చీపురు పుల్లలు సేకరిస్తున్న చెంచు మహిళలు



రాంపూర్ పెంటలో చెంచులు నివాసం ఉండే బొడ్డు గుడిసె

మన్ననూర్: అటవీ ఉత్పత్తుల సేకరణపై ఆధారపడి జీవిస్తున్న ఆదివాసీ చెంచులకు జీవనాధారంగా ఉండేందుకు అటవీ ఫలసాయం మొక్కలు ప్రభుత్వం అందించడం లేదు. దీంతో అడవిబిడ్డలు జీవనోపాధి కోల్పోయి జీవితాలు దుర్భరంగా మారుతున్నాయి. కొన్నేళ్లుగా చెంచులకు ప్రభుత్వ ఫలసాయం మొక్కలు అందించకపోవడంతో వారి జీవితాలు అగమ్యగోచరంగా మారాయి. గతంలో ఫలసాయం మొక్కలు పెంచి వాటి ద్వారా వివిధ రకాల ఉత్పత్తులను విక్రయించి బతికేవారు. ప్రస్తుతం అటవీ ఉత్పత్తులకు సంబంధించిన మొక్కలు సరఫరా చేయకపోవడంతో జీవనాధారం కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొంది.

అటవీ ఉత్పత్తులు లేక అవస్థలు

గతంలో నల్లమల అభయారణ్యంలో మొర్లీ, చింత, కానుగు, ఇసముష్టి, గోగు, తవుసి, సిల్ల, ఉసిరి, మాడుపు, కుంకుడు కాయలకు సంబంధించిన వృక్షాలు విస్తారంగా ఉండేవి. చెంచులతో పాటూ అటవీ సమీప గ్రామాల ప్రజలు వీటిని సేకరించి విక్రయించగా వచ్చే ఆదాయంలో జీవనం చేసే వారు. అటవీ ఉత్పత్తులను సేకరించిన చెంచులు గిరిజన సేవా సంస్థలో విక్రయించి వాటి స్థానంలో నిత్యవసరాలు కొనుగోలు చేసుకునే వారు. చెంచులకు జీవనాధారమైన అటవీ ఫలసాయం మొక్కలు ప్రస్తుతం నల్లమల అటవీ ప్రాంతంలో కనుచూపు మేరలో ఎక్కడ కనిపించకపోగా ఆ వృక్షాలు పూర్తిగా అంతరించి పోయాయి. దీంతో మల్లాపూర్, పుల్లాయిపల్లి, రాంపూర్, అప్పాపూర్, భౌరాపూర్, మేడిమల్కల, ఈర్లపెంట, సంఘిడిగుండాలు, పందిబోర్రై, సార్లపల్లి, కుడిచింతలబైలు తదితర అటవీ సరిహద్దు గ్రామాలు, పెంటలలోని చెంచులకు ఎలాంటి ఫలసాయం దొరక్క దిక్కుతోచనిస్థితిలో ఉన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం కల్పించే ఉపాధి హామీ పథకం పనులు, సబ్సిడీ బియ్యం, ప్రభుత్వం ఇస్తున్న ఉచిత ప్రోత్సాహాలపై పై ఆధారపడాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇప్పటికే మైదాన ప్రాంత చెంచులకు పంపిణీ చేస్తున్న ఫలసాయం మొక్కలను మాకు కూడా ఇస్తే అడవుల్లో నాటుతామని వేడుకుంటున్నారు. అదేవిధంగా అంతరించి పోయిన వృక్షాల స్థానంలో అక్కడక్కడ ప్లాంటేషన్లు ఏర్పాటు చేసి ఆదిమజాతి చెంచులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దశాబ్దాల కాలంగా వీటినే నమ్ముకుని జీవిస్తున్న చెంచులు కారణాలు ఏవైనా ఫలసాయం జాతి వృక్షజాలం అడవుల్లో నశించిపోతుండటంతో ఆదివాసీ చెంచుల జీవనం దుర్భరమైందని వాపోతున్నారు.

మొక్కలు నాటేందుకు ప్రణాళిక

చెంచుల సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని తరిగిపోయిన అటవీ ఫలసాయం వృక్షాల స్థానంలో కొత్తగా మొక్కలు నాటేందుకు ప్రణాళిక రచిస్తున్నాం. అడవి బిడ్డల అభివృద్ధి కోసం గిరిజన కో-ఆపరేటివ్ సంస్థ (జీసీసీ) ఏర్పాటు చేశారు. సంస్థ ఆధ్వర్యంలో వారికి జీవనోపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

–చంద్రబాను, జీసీసీ బ్రాంచ్ మేనేజర్

బతుకుదెరువు లేదు



అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవిస్తున్నాం. ఫలసాయం మొక్కలు ఇచ్చి ఉపాధి చూపించాలి. ఉపాధి పథకం ద్వారా అటవీ పరిసర ప్రాంతంలో మొక్కలు నాటించాలి. నాలుగు, ఐదేళ్లలో వాటి నుంచి ఉత్పత్తులు మొదలవుతాయి. ప్రభుత్వం చెంచులకు ఉపాధి కల్పించాలి.

– తోకల గురువయ్య, అప్పాపూర్

మొక్కలు నాటితే కాపాడుకుంటాం



అటవీ ఉత్పత్తుల మొక్కలు నాటితే కాపాడుకుంటాం. నాలుగేళ్ల తర్వాత ఉపాధి పొందవచ్చు. అప్పుడు ఎక్కడికి పనికి వెళ్లాల్సిన అవసరం ఉండదు. అడవుల్లో ఇంతకు ముందు దొరికినట్లుగా గడ్డలు, గుడిపాల వేర్లు, తేనే, జిగురు దొరుకుతలేవు. తేనే తెట్టెలు(ఈగలు) కూడా ఎక్కువగా కనిపిస్తలేవు. ఉపాధి పని లేకుంటే బతకడం కష్టంగా ఉంది.

– నల్లపోతుల లింగయ్య, రాంపూర్‌పెంట

మున్సిపాలిటీ ఎన్నికల్లో సత్తా చాటుదాం



మాట్లాడుతున్న ధర్మనాయక్

కల్వకుర్తి రూరల్: మున్సిపాలిటీ ఎన్నికల్లో సత్తా చాటుదామని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణంలోని పార్థసారథి ఫంక్షన్ హాల్‌లో పార్టీ పట్టణ అధ్యక్షుడు గన్నోజు బాబిదేవ్ అధ్యక్షతన నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల కార్యశాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మున్సిపాలిటీ పరిధిలోని 22 కౌన్సిలర్ల స్థానంలో పోటీ చేసి పార్టీ అభ్యర్థులను గెలిపించుకుంటామన్నారు. విద్యానగర్ కాలనీకి చెందిన కాళిదాస్‌చారి బీజేపీలో చేరారు. బండేల రామచంద్రారెడ్డి, దుర్గాప్రసాద్, రాఘవేందర్ గౌడ్, శేఖర్‌రెడ్డి, వివేకానంద, గంగాధర ఆచారి, రాంభూపాల్ రెడ్డి, నరసింహ, విజయ్, రామ్ రెడ్డి, చందు, నరేష్ గౌడ్ పాల్గొన్నారు.

బీజేపీతోనే ప్రజా సంక్షేమం

బల్మూర్: బీజేపీతోనే ప్రజా సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యులు, రాష్ట్ర నాయకుడు ధర్మనాయక్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం మండల అధ్యక్షుడు బాలస్వామి అధ్యక్షతన నిర్వహించిన బీజేపీ మండల కార్యశాల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను క్షేత్ర స్థాయిలో ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. ఉచిత బియ్యం, ఉజ్వల యోజన పథకం కింద గ్యాస్ సిలిండర్ల పంపిణీ, అత్యోదయ అన్నయోజన, ఎరువుల సబ్సిడీ,, పీఎం కిసాన్‌నిధి పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా అచ్చంపేట నియోజకవర్గంలోని ప్రసిద్ధిగాంచిన ఉమామహేశ్వర దేవాలయం దర్శనానికి బస్సుల ఏర్పాటుపై ట్రస్టు పేరుతో భక్తులను దోపిడీ చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జ్ అడ్వకేట్ వెంకటశెట్టి, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ రావు, సీతారాంరెడ్డి, మండల మహిళామోర్చా అధ్యక్షురాలు రాధిక, సింగిల్‌విండో డైరెక్టర్ మల్లికార్జున్, నాయకులు పెద్దయ్య, జానకిరాములు, సైదులు, వెంకటయ్య, సాయిబాబు, రాములు, ఆయా గ్రామాల పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారులపై కాంగ్రెస్ నాయకుల ఒత్తిడి సరికాదు

బల్మూర్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో కాంగ్రెస్ నాయకుల ఒత్తిళ్ల వల్లే అధికారులు బలవుతున్నారని మాజీ సర్పంచ్ బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు మల్లేష్‌సాగర్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పారదర్శకంగా కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు తెలుపుతున్నా గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యదర్శులపై వత్తిడి తెచ్చి పాత బేస్‌మెంట్లకు బిల్లులు ఇప్పించడం వల్లే బల్మూర్ మండలంలోని పోలిశెట్టిపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్ అయ్యారని వివరించారు. మండలంలో ఇలాంటి తప్పుడు బిల్లులు ఇచ్చారని దీనిపై అధికారులు విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారులు అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గకుండా అర్హులైన వారికి లబ్ధిచేకూరేలా పని చేయాలని ఆయన కోరారు.

కాంగ్రెస్‌లో చేరిక



నాగర్‌కర్నూల్ రూరల్: మండలంలోని గుడిపల్లిలో బీఆర్ఎస్‌కు చెందిన గ్రామ నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. శుక్రవారం ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం సాధ్యమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల వారీగా ఓటరు జాబితా

పెద్దకొత్తపల్లి: గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం గ్రామంలోని వార్డుల వారీగా ఓటరు లిస్టులను సిద్ధం చేస్తున్నామని ఎంపీడీఓ నాగేంద్రం పేర్కొన్నారు. శుక్రవారం కార్యాలయంలో ఆయా వార్డుల ప్రకారం ఓటరు లిస్టును తయారుచేసే పనుల్లో పంచాయతీ కార్యదర్శులు నిమగ్నం అయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ స్థానిక ఎన్నికలకు సన్నద్ధం అవుతున్నామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

కుమారుడిని ప్రభుత్వ బడిలో చేర్పించిన ఎంపీడీఓ



చారకొండ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ఎంపీడీఓ అందరికి ఆదర్శంగా నిలిచాడు. ఇటీవల మండల ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన మాలోతు శంకర్ నాయక్ తమ కుమారుడు భువన్ సాయి నాయక్‌ను శుక్రవారం ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతిలో చేర్పించారు. సంబంధిత ఫారంను నింపి ప్రధానోపాధ్యాయులు భగవాన్ రెడ్డి శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యా అందుతుందన్నారు. మండలంలోని అధికారులు, గ్రామంలో విద్యార్థుల తల్లిదండ్రులు అభినందిస్తు హర్షం వ్యక్తం చేశారు.

మొక్కలను పరిశీలించిన ఎంపీఓ



కోడేరు: మండలంలోని పస్పులలో ఎన్ఆర్ఐజీఎస్ కింద పెంచుతున్న మొక్కలను ఎంపీఓ మల్లేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కావడంతో రోడ్లకు ఇరువైపులా గుంతలుతీసి మొక్కలు నాటాలన్నారు. ప్రతి ఇంటికి పండ్ల మొక్కలను పంపిణీ చేయాలని పంచాయతీ కార్యదర్శి కురుమూర్తికి సూచించారు.

సర్వేకు సహకరించాలి

కోడేరు: మండలంలోని ఎత్తంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు సర్వేకు సహకరించాలని శుక్రవారం పంచాయతీ కార్యదర్శి రమేష్ కోరారు. అనంతరం గ్రామంలో సర్వే నిర్వహించారు. పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

అందుబాటులో యూరియా

కోడేరు: మండల కేంద్రంతో పాటు సింగాయిపల్లిలోని సింగిల్ విండో కార్యాలయంలో రైతులకు అందుబాటులో యూరియా ఉందని సింగిల్ విండో చైర్మన్ చిన్నారెడ్డి, సీఈఓ ప్రకాష్‌రెడ్డిలు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యూరియా కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు, పాసుబుక్కు జిరాక్స్ వెంట తీసుకురావాలని తెలిపారు. దాదాపు 1800లకు పైగా యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ



తెలకపల్లి: మండలంలోని బొప్పలిలో శుక్రవారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి మాజీ ఎంపీటీసీ నిరంజన్ ముగ్గు పోసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 619 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయని తెలిపారు. ఇప్పటికే 300పైగా ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయని వివరించారు.

యూత్ ప్రెసిడెంట్‌గా వేణుగోపాల్

పెంట్లవెల్లి: మండలంలోని గోపులాపూర్ గ్రామానికి చెందిన పాశం వేణుగోపాల్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన వంశరాజ్ సమావేశంలో రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియామక పత్రాన్ని రాష్ట్ర అధ్యక్షుడు ఇరిగిజ్జ మురళీకృష్ణ అందించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

పోస్టర్ విడుదల

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆగస్టు 1, 2వ తేదీల్లో నిర్వహించే జిల్లా మహాసభలకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం సీపీఐ రాష్ట్ర నాయకుడు వార్ల వెంకటయ్య, కేశవులు గౌడ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమావేశాలకు సాంబశివరావు, వెంకటరెడ్డి, గోరెటి వెంకన్న, బాల్ నరసింహ తదితరులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు భరత్, శ్రీనివాసులు, పరశురాములు, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కొల్లాపూర్: ఉద్యోగ, ఉపాధ్యాయ రంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం టీఎస్‌యూటీఎఫ్ నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ గోవిందరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. వేణుమాధవ్‌గౌడ్, కురుమయ్య, రాజేష్, శ్రీరామ్, సూర్యశేఖర్, క్రాంతికుమార్, బాలాజీ, శ్రీనివాసులు, బంగారయ్య, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

సమస్య పరిష్కారానికి కృషి



అండర్ గ్రౌండ్‌డ్రెయినేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి

నాగర్‌కర్నూల్: సమస్య పరిష్కారానికి కృషి చేస్తానిన ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని 10, 24 వార్డులలో వర్షం నీరు ఇళ్లలోకి ప్రవేశించి ప్రజలు ఇబ్బందులు పడుతున్నాని మాజీ కౌన్సిలర్లు నిజాముద్దిన్, బాదం సునీతలు ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, సిబ్బందితో కలిసి ఆయన వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. మురుగునీరు కాలనీలలోకి ప్రవేశించకుండా ఎప్పటికప్పుడు అండర్ డ్రెయినేజీ సిస్టం సరి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



వెల్దండ పోలీస్‌స్టేషన్‌లో కేసుల వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

వెల్దండ: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని కల్వకుర్తి డీఎస్పీ వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కు ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి కావడంతో రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలమన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపినవారిపై చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. శ్రీశైలం పుణ్యక్షేత్రానికి భక్తులు అధిక సంఖ్యలో వెళ్తుండడంతో ప్రతి రోజు సాయంత్రం వేళల్లో ప్రత్యేక వాహనాల తనిఖీ నిర్వహించాలన్నారు. ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. పెండింగ్ కేసులపై ఆరా తీశారు. కార్యక్రమంలో సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ కురుమూర్తి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని వ్యాపారులు విధిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కల్వకుర్తి డీఎస్పీ వెంకట్ రెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో బంగారం, గిరివి, ప్రైవేటు ఫైనాన్స్‌లు, కిరాణ దుకాణాదారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కల్వకుర్తి సీఐ నాగార్జున, ఎస్ఐ మాధవరెడ్డి, పోలీస్ సిబ్బంది, దుకాణాదారులు పాల్గొన్నారు.

బస్టాండ్‌కు పూర్వ వైభవం

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో కొన్నేళ్లుగా ఆర్టీసీ బస్టాండ్ శిథిలావస్థకు చేరి, చుట్టూ కంప, మురుగు, చెత్తచెదారంతో దర్శనమిచ్చేది. దీంతో బస్టాండ్‌లోకి బస్సులు వచ్చేవి కావు. కొన్నిరోజుల కిందట బస్టాండ్ వినియోగంలోకి తీసుకురావాలని గ్రామ యువకుడు టెంట్ వేసి దీక్ష చేశారు. దీంతో అధికారులు స్పందించి బస్టాండ్‌కు మరమ్మతు చేపట్టారు. శుక్రవారం బస్టాండ్‌లోకి బస్సులు రావడంతో ప్రయాణికులు, స్థానికులు, నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. అధికారులకు ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.

సొంత భవనం నిర్మించాలి

కందనూలు: బీసీ హాస్టల్‌కు సొంత భవనం నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పలు హాస్టల్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా బీసీ హాస్టల్‌కు సొంత భవనం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రైవేటు భవనంలో సరైన వసతులు లేవన్నారు. ఇప్పటికీ విద్యార్థులకు దుప్పట్లు, ప్లేట్లు, ఇతర సామాగ్రి ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అభినయ్, తదితరులు పాల్గొన్నారు

లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి

బిజినేపల్లి: పత్తి, మొక్కజొన్న పంటలో ఆయా రకాల చీడపీడల నుంచి తప్పించుకోవడానికి ఎకరాకు పది లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని సస్యరక్షణ శాస్త్రవేత్త డా.ఓ.శైల అన్నారు. శుక్రవారం మండలంలోని ఖానాపూర్‌లో పత్తి, మొక్కజొన్న పంట క్షేత్రాలను సందర్శించి వాటిలో కత్తెర పురుగు, కాండం కుళ్లు బ్యాక్టీరియా, పూత అనంతరం వచ్చే ఎండు తెగుళ్లను గుర్తించినట్లు తెలిపారు. అనంతరం స్థానిక రైతు వేదిక వద్ద రైతులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కత్తెర పురుగు నివారణకు వేపనూనె, కోరాజిన్, ఎమామెక్టిన్, బెంజోమెట్ మందులతో పిచికారీ చేసుకోవాలన్నారు. పత్తిలో రసం పీల్చే పురుగు నివారణకు కాండానికి పూసే పద్ధతి, పురుగులను ఆకర్షించడానికి జిగురు అట్టలను అమర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డా.పి.శ్రీదేవి, రావేఫ్ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



ఉప్పునుంతల/లింగాల: అచ్చంపేట పట్టణంలో కొనసాగుతున్న మండలంలోని వెల్టూరు మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం ఉప్పునుంతల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డాక్టర్ స్వప్న, వైద్య సిబ్బంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా లింగాల మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి స్నేహ అన్ని రకాల పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ప్రభావతి, హెల్త్ అసిస్టెంట్ జగదీష్, సిబ్బంది నవ్య, జ్యోతి పాల్గొన్నారు.

ఇంటింటికీ మొక్కల పంపిణీ

కోడేరు: మండలంలోని గుండ్యావాల్యానాయక్‌తండాలో వనమహోత్సవం సందర్భంగా శుక్రవారం పంచాయతీ కార్యదర్శి అలివేల ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు. ప్రతి ఇంటికి ఆరు పండ్ల అందజేస్తునట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో జైలుశిక్ష

తాడూరు: మండలంలోని గుంతకోడురు గ్రామానికి చెందిన కొప్పునురు వెంకటయ్య(55) ఎంగంపల్లి గేట్ సమీపంలో నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. నిందితుడిని శుక్వారం కోర్టులో హాజరుపర్చగా జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్టు క్లాస్ శృతి దూత ఒక రోజు జైలుశిక్షతోపాటు, రూ.100 జరిమానా విధించినట్లు ఎస్ఐ గురుస్వామి తెలిపారు.

విద్యా సామర్థ్యాలు పెంపొందించాలి



వెల్దండ: విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలు పెంపొందించాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ చంద్రుడు కోరారు. శుక్రవారం పెద్దాపూర్ ఉన్నత పాఠశాల ఆవరణంలో మండల స్థాయి కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. మండలంలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ చంద్రుడు మాట్లాడుతూ విద్యార్థులకు పాఠ్యంశాలతో పాటు పాఠశాలల్లో గ్రంథాలయం నిర్వహణను పరిచయం చేయాలన్నారు. ఎఫ్ఎల్ఎన్ అంశాలను దృష్టిలో పెట్టుకొని పాఠాలు బోధించాలన్నారు. పాఠశాలల పరిశుభ్రతపై ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో వెల్దండ కాంప్లెక్స్ జీహెచ్‌హెం రవీందర్, రాజశేఖర్, రిసోర్స్ పర్సన్‌లు విష్ణు, స్వామి, రాజు, సీఆర్‌పీలు అంజ్యానాయక్, చంద్రశేఖర్, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

సామాజిక తనిఖీకి నివేదికలు సిద్ధం

పెద్దకొత్తపల్లి: సామాజిక తనిఖీకి నివేదికలు సిద్ధం చేసినట్లు ఎంపీడీఓ నాగేంద్రం, ఏపీఓ వెంకటేషులు పేర్కొన్నారు. శుక్రవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలో 2025-26 సంవత్సరంలో రూ.1.86 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఆగస్టు మొదటి వారంలో ఉపాధి పనులపై సామాజిక తనిఖీ చేసేందుకు బృందాలు మండలానికి వస్తున్నట్లు వారు వివరించారు. ఎటువంటి తప్పులు లేకుండా ఫైళ్ల సిద్ధం చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు సూచించారు. 29 గ్రామాల్లో 29 ఎకరాలల్లో పండ్ల తోటలు, 1500 ఈత మొక్కలు నాటించామన్నారు. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు జరిగిన పనులపై సామాజిక తనిఖీ ఉంటుందని తెలిపారు.

బస్సు సౌకర్యం పునరుద్ధరణ



తాడూరు: మండలంలోని పాపగల్‌లో శుక్రవారం నాగర్‌కర్నూల్ డిపోకు చెందిన బస్సును పునరుద్ధరించారు. గతంలో జిల్లా కేంద్రం నుంచి ఇంద్రకల్, సిర్సవాడ, బాదేపల్లికి బస్సును నడిపించేవారని కొన్ని కారణాల వల్ల ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యాన్ని రద్దు చేశారు. ఈ విషయం స్థానిక ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వారు ప్రత్యేక చొరవ తీసుకొని బస్సును సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకున్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



కందనూలు:జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డు లోగల ప్రభుత్వ ఆర్ట్స్ డిగ్రీ కళాశాల స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా కార్యదర్శి శివశంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టర్ ఏఓ చంద్రశేఖర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగారు బాబు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ప్రసాద్ కుమార్, కళాశాల ప్రెసిడెంట్ శివ, భరత్, నిశాంత్, మున్న, ప్రసాద్, వెంకట్ రెడ్డి, బాలకృష్ణ, ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.